బొమ్మలకు ప్రాణ ప్రతిష్ట

- తెనాలికి చెందిన సూర్య శిల్పశాల అధినేతల సృజన
- ఏడుతరాలుగా కొనసాగిస్తున్న శిల్పకళ
- వైవిధ్యమైన సృజనతో అంతర్జాతీయ ఖ్యాతి
- తాజాగా 'భారతరత్న' అంబేడ్కర్ విగ్రహాల ప్రదర్శన
- అడుగు నుంచి 30 అడుగుల వరకు కొలువుదీరిన విగ్రహాలు
- గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు ప్రయత్నం


కూర్చున్న భంగిమలో అంబేడ్కర్ విగ్రహాలు

తెనాలి: శిలాశాసనులీ తండ్రీ కొడుకులు...వారసత్వంగా వస్తున్న శిల్పకళను ఏడుతరాలుగా కొనసాగిస్తున్న సృజనకారులు. ఫైబర్, కాంస్యం, ఐరన్ స్క్రాప్, త్రీడీ విగ్రహాలతో తమ సృజనకు టెక్నాలజీని జోడిస్తున్నారు. వైవిధ్యమైన శిల్పాలను రూపొందిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని గడిస్తున్నారు. ఆ క్రమంలో భారత రాజ్యాంగ ఆమోద వజ్రోత్సవాల వేళ 'భారతరత్న' డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌తో సహా పలు రికార్డుల సాధనకు ప్రయత్నిస్తున్నారు

శిల్పకళకు కొత్తపుంతలు

తెనాలికి చెందిన సూర్య శిల్పశాల అధినేత కాటూరి వెంకటేశ్వరరావు, ఆయన కుమారులు రవిచంద్ర, శ్రీహర్షలు శిల్పకళను కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఫైబర్, కాంస్య విగ్రహాలతో కాటూరి వెంకటేశ్వరరావు రాణిస్తుంటే, కోల్‌కతాలో ఫైనార్ట్స్‌లో పీజీ చేసిన కొడుకు రవిచంద్ర ఆ కళకు మరింత వన్నెలు తెస్తున్నారు. ఇనుప వ్యర్థాలతో భారీ విగ్రహాలను తయారుచేస్తూ దేశవిదేశీయులను ఆకర్షిస్తున్నారు. అతడి సోదరుడు శ్రీహర్ష త్రీడీ టెక్నాలజీలో అతి సూక్ష్మ విగ్రహాల్నుంచి భారీ విగ్రహాల వరకు తీర్చిదిద్దుతున్నారు. వీరి విగ్రహాలు దేశంలోని అనేక నగరాల్లో ప్రతిష్ఠకు నోచుకోవటమే కాకుండా, విదేశాల్లోనూ కొలువుదీరాయి. తమ విగ్రహాలతో తెనాలిలో కాటూరి ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటుచేసి, తమ కళానైపుణ్యాన్ని అక్కడ ప్రదర్శిస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహాలతో ప్రదర్శన

ప్రస్తుతం భారత రాజ్యాంగ ఆమోద వజ్రోత్సవాలను దేశమంతటా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలతో ప్రదర్శన నిర్వహించాలని తలపోశారు. అనుకున్నదే తడవుగా గత కొద్దినెలలుగా తీవ్రంగా శ్రమించారు. యాభై విగ్రహాలతో కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనను బుధవారం సాయంత్రం ఏర్పాటుచేశారు. ఫైబర్, కాంస్య విగ్రహాలు రకరకాల సైజుల్లో ఇందులో కొలువుదీర్చారు. అడుగు ఎత్తు నుంచి 30 అడుగు ఎత్తు వరకు అంబేడ్కర్ విగ్రహాలను ఇందులో చేర్చారు. వీటిలో అడుగు ఎత్తులో ఉన్న బస్ట్ సైజువి త్రీడీ టెక్నాలజీతో రూపొందించారు. వీటితోపాటు కుర్చీలో కూర్చున్న భంగిమ నుంచి నిలుచున్న విగ్రహాలూ రకరకాల సైజుల్లో ఈ ప్రదర్శనలో చోటుచేసుకుని చూపరులను ఆకర్షిస్తున్నాయి. తమ శిల్పకళా నైపుణ్యానికి కాటూరి శిల్పకారులు అభినందనలు అందుకుంటున్నారు.


త్రీడీ టెక్నాలజీ విగ్రహం

వారసత్వంగా శిల్పకళ

సూర్య శిల్పశాలతో విగ్రహాల రూపకల్పనలో కొనసాగుతున్న కాటూరి వెంకటేశ్వరరావు ఆ వంశంలో ఆరోతరం వారు. ఏడోతరానికి చెందిన ఆయన ఇద్దరు కుమారులూ, వారసత్వంగా వస్తున్న శిల్పకళనే వృత్తిగా చేసుకోవటం విశేషం! వెంకటేశ్వరరావు తాత చంద్రయ్య సిమెంటు విగ్రహాలు, దేవాలయాల నిర్మాణం, దేవతా విగ్రహాలను తయారుచేసేవారు. తండ్రి కోటేశ్వరరావు రాజకీయ నేతల విగ్రహాలను కేవలం సిమెంటుతోనే చేసేవారు. వెంకటేశ్వరరావు ఆ విగ్రహాలతోనే ఆరంభించి, తన సృజనతో ఫైబర్, కాంస్య విగ్రహాల తయారీని ఆరంభించారు. కొడుకులు అందివచ్చాక నైపుణ్యం పెరిగింది. ఐరన్ స్క్రాప్ వ్యర్థాలతో భారీ విగ్రహాలను తయారుచేస్తూ రవిచంద్ర, త్రీడీ టెక్నాజీలతో శ్రీహర్షలు తమ శిల్పకళకు ఆధునిక హంగులు అద్దారు. అంతర్జాతీయ గుర్తింపును సాధిస్తున్నారు. తాజా ప్రదర్శనలో ఉంచిన శిల్పాల్లో అధికశాతం హ్యాండ్‌వర్క్‌తోనే చేశారు. ఇందుకోసం 50 మందికి పైగా వర్కర్లతో 5–6 నెలలుగా కృషిచేసినట్టు చెబుతున్నారు.

గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నం

> శిల్పకళలో తెనాలి ఖ్యాతిని ఇనుమడింపజేయటం...గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించాలనే ప్రయత్నంతోనే ఈ ప్రదర్శన ఆరంభించాం. వీడియోలు, ఫొటోలు పంపాం. పరిశీలిస్తున్నట్టు సమాచారం పంపారు. అమెరికన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ ఆఫ్ రికార్డ్స్ వారు తమ సంసిద్ధతను తెలియజేశారు. త్వరలోనే వస్తాయని ఆశిస్తున్నాం.
>
> – కాటూరి వెంకటేశ్వరరావు, శిల్పకారుడు

గ్రామీణ వైద్యుల ఆరోగ్య సేవలు భేష్

మహాసభల్లో మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు


సభలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్


సర్టిఫికెట్లను అందజేస్తున్న నక్కా ఆనందబాబు

తెనాలి: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్సతో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు గొప్పవని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రభుత్వపరంగా వీరికి గుర్తింపును ఇచ్చేందుకు కృషి చేయగలనని హామీనిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ తెనాలి డివిజన్ స్థాయి 40వ మహాసభలు ఆదివారం స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా జరిగాయి. అసోసియేషన్ తెనాలి డివిజన్ అధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు ప్రభుత్వం నుంచి గుర్తింపు రావాలన్న కోర్కె నెరవేరకపోవటం బాధాకరమని చెప్పారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు లభింపజేసేలా అసెంబ్లీలో అంశాన్ని ప్రస్తావనకు తీసుకువచ్చి తన వంతు సహకరిస్తానని చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం ద్వారా గుర్తింపు తెచ్చేందుకు జీవోను విడుదల జరిగిందని గుర్తుచేశారు. అది కార్యరూపం దాల్చకపోవటంతోనే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామీణ వైద్యుల ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, గుంటూరు జిల్లా ఏపీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు రాజా సిద్ధార్థ మాట్లాడుతూ ఫెడరేషన్‌తో సభ్యులకు అనేక సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వపరమైన సహకారం కోసం ఎంతో కృషిచేస్తున్నట్టు తెలిపారు. కూటమి పాలనలో అనుకూలమైన జీవో వెలువడుతుందన్న ఆశాభావంతో ఉన్నట్టు చెప్పారు. అసోసియేషన్ తెనాలి డివిజన్ ప్రధాన కార్యదర్శి పుల్లారావు, కోశాధికారి రంగారావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుగుణేశ్వరి, రాష్ట్ర గౌరవ సలహాదారు ఎల్.ఎస్.రావు ఫెడరేషన్ అధ్యక్షుడు జీఎస్ ప్రసాద్ ప్రసంగించారు. ఇదే వేదికపై దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న పలువురు ఆర్‌ఎంపీలను సత్కరించారు. ఆగమ శాస్త్ర ప్రకారం పండితులు ధన్వంతరికి విశేష పూజలు జరిపారు. కల్యాణి కూచిపూడి ఆర్ట్ అకాడమీ విద్యార్థులు నృత్యాంశాలను ప్రదర్శించారు. అసోసియేషన్ ద్వారా 400 మంది సభ్యులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. పలు జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయిలోని ఫెడరేషన్, ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోతికి కరెంటు షాక్


కోతికి వైద్యం చేస్తున్న రంగారావు

తెనాలి: రూరల్ మండలం కొలకలూరులో విద్యుదాఘాతానికి గురైన కోతికి స్థానికులు ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. గ్రామంలోకి వచ్చిన గోతుల గుంపులోని ఓ కోతి, ఒక చెట్టుపై తిరుగుతుండే క్రమంలో కొమ్మ విద్యుత్ తీగెలకు తగిలింది. ఆ ప్రభావంతో విద్యుత్ షాక్ తగిలి కిందపడింది. గిలగిల కొట్టుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన అక్కడి యువకులు గ్రామంలోని విశ్రాంత జూనియర్ వెటరనరీ అధికారి ఆలపాటి రంగారావును పిలిపించారు. ఆయన స్థానికుల సాయంతో కోతికి ఇంజక్షన్లు చేసి ప్రాథమిక చికిత్స అందించారు. దీంతో ఆ కోతి కొద్దిసేపటికి ప్రాణాపాయం నుంచి బయటపడింది. కోతుల గుంపులు ఆహారం దొరక్క ఊర్లోకి వస్తున్నాయని, ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నాయని గ్రామస్తులు తెలిపారు.

ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ఖాళీ స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రేపల్లె రూరల్: పట్టణంలో ఖాళీ స్థలాలను యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని ఖాళీస్థలాలలో ఆదివారం మున్సిపల్ బోర్డులను ఏర్పాటు చేసి అనంతరం మాట్లాడారు. ప్రజలు స్థలాలను కొనుగోలు చేసి వాటి నిర్వహణ బాధ్యతలు వదిలేయటంతో స్థలాలలో పిచ్చిమొక్కలు పెరిగి సమీపంలోని గృహాల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిచ్చిచెట్లు పెరగటంతో విషపురుగుల సంచారం అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విధంగా వదిలేసిన స్థలాలను మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుని, ఈ స్థలం మున్సిపాలిటీకి చెందినదని బోర్డులను ఏర్పాటు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. శానిటేషన్ సెక్రటరీలు ఎస్.నరేంద్ర, జి.వందనా ప్రియదర్శిని, బి.కళ్యాణి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పశువులకు తీవ్ర గాయాలు



కొల్లూరు: అగ్ని ప్రమాదం చోటుచేసుకొని పశువులు తీవ్ర గాయాల బారిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని మొసలిపాడుకు చెందిన కట్టుపల్లి సుజాత పశుపోషణ ద్వారా లభించే ఆదాయంతో కుటుంబ పోషణ చేపడుతూ జీవనం సాగిస్తుంది. అయితే ఆమె ఇంటికి సమీపంలో ఉన్న వరిగడ్డివాము నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతోపాటు, పక్కనే ఉన్న పశువుల చావిడికి వ్యాపించాయి. అగ్ని ప్రమాదాన్ని పసిగట్టి పాకలో ఉన్న ఐదు పశువులను బయటకు తీసుకొచ్చేందుకు సంబంధిత కుటుంబ సభ్యులతోపాటు, స్థానికులు ప్రయత్నించారు. అయితే అప్పటికే మంటలు తీవ్రంగా వ్యాపించడంతో నాలుగు పశువులకు మంటలు అంటుకొని తీవ్ర గాయాలపాలయ్యాయి. సుమారు రూ. 50 వేల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన పశువులను పశుసంవర్ధక శాఖ వైద్యులు పరీక్షించి సేవలు అందజేశారు. అగ్ని ప్రమాదంపై బాధిత కుటుంబ సభ్యుల నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిరుద్యోగ భృతిని ప్రభుత్వం అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్కే వలి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అఖిల భారత యువజన సమైక్య గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే వలి డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరి పట్టణ పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణ భగవాన్ ఏఐవైఎఫ్ కార్యాలయంలో నియోజకవర్గ మహాసభ నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు జాలాది నవీన్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ పాల్గొన్నారు. వలి మాట్లాడుతూ సంస్థ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించినట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తానని చెప్పి, విఫలమైందని విమర్శించారు. వాలంటీర్లకు రూ.5 వేలు కాదు రూ.10 వేలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వలంటీర్లను విధుల నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువజన సమైక్య జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తానని హామీ ఇచ్చారని, ఆసుపత్రి నిర్మాణానికి కృషి చేస్తున్నందుకు అభినందనీయమన్నారు. చిన్న పిల్లలకు ప్రత్యేకంగా ఆసుపత్రి నిర్మించాలని కోరుతున్నామన్నారు. అనంతరం నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంటూరి గోపిరాజు, ప్రధాన కార్యదర్శిగా జాలాది నవీన్, ఉపాధ్యక్షుడిగా కంచర్ల క్రాంతి, సహాయ కార్యదర్శిగా ఉయ్యాల నరసింహను ఎన్నుకున్నారు. జాలాది విజయ్, శ్రీకాంత్, కిరణ్, బాబా, మణికంఠ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా భీంకోరే గావ్ శౌర్య దినోత్సవం


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అంబేడ్కర్ ఇండియా మిషన్ సభ్యులు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తూ భీంకోరే గావ్ శౌర్య దినోత్సవాలను జరుపుకొందామని బాపట్ల జిల్లా అంబేడ్కర్ ఇండియా మిషన్ (ఏఐఎం) అధ్యక్షులు చింతాయ సురేష్, శ్యామ్యూల్ రాజ్‌లు తెలిపారు. భీమ్‌కోరే గావ్ శౌర్య దినోత్సవాలలో భాగంగా అంబేడ్కర్ ఇండియా మిషన్ సభ్యులు ఆదివారం పిట్టలవానిపాలెంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా చింతా సురేష్, శ్యామ్యూల్ రాజ్‌లు మాట్లాడుతూ 7వేల మంది పీష్వా సైనికులను ఓడించిన 500 మంది మెహర్ రెజిమెంట్ సైన్యం విజయోత్సవాలను దేశ వ్యాప్తంగా జరుపుకొంటున్న సందర్భంగా పిట్టలవానిపాలెంలో వేడుకలు నిర్వహించామని తెలిపారు. ఈసందర్భంగా యువతకు బాబా సాహెబ్ అంబేడ్కర్ టీ షర్ట్‌లను పంపిణీ చేశారు. నిరంజన్ బాబు, శ్యామ్‌సుందర్, భూషణం, ఏసుబాబు, విన్నిబాబు, పున్నారావు, రాజీవ్, శశిబాబు, పవన్, రమేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సభ్యులకు ఆటల పోటీలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): పెదవడ్లపూడి గ్రామంలో మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కేరింత అనే కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ క్లబ్ అడ్మినిస్ట్రేషన్ అన్నే రత్న ప్రభాకర్ మాట్లాడుతూ స్నేహం, సేవ అనే ప్రధాన లక్ష్యంతో రోటరీ పనిచేస్తోందన్నారు. రోటరీ ప్రతినిధుల మధ్య ఐక్యత ఉంటే ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అలాంటి ఐక్యతకు కేరింత వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. పబ్లిక్ ఇమేజ్ కో చైర్ ఇసునూరి అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఫ్రెండ్ షిప్, ఫెలోషిప్‌లకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం మంగళగిరి, తాడేపల్లి, తెనాలి, గుంటూరు రోటరీ క్లబ్‌లకు చెందిన కుటుంబాలకు ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. రోటరీ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి అందే మురళి, కోశాధికారి వడ్లమూడి శ్రీనివాసరావు, తాడేపల్లి క్లబ్ అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు, తెనాలి ప్రతినిధి కందిమళ్ళ స్వప్న పాల్గొన్నారు.

మాజీ సైనికుల కార్పొరేషన్ ప్రకటనపై హర్షం


సమావేశంలో పాల్గొన్న మాజీ సైనిక ఉద్యోగులు

తాడేపల్లి రూరల్ : ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సైనికుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మాజీ సైనికుల సంక్షేమ సంఘం ధన్యవాదాలు తెలియజేస్తోందని గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె. గోవిందరావు అన్నారు. ఆదివారం మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు కె. గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పలు మాజీ సైనికుల సంక్షేమ సంఘాలు ఉన్నాయని, ప్రస్తుతం అన్ని సంఘాలను ఐక్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే మాజీ సైనిక సంక్షేమ సంఘం ఉండాలని లక్ష్యంతో వైజాగ్ తదితర ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించామన్నారు. త్వరలో సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మంగళగిరి వెటర్న్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శంకర్ రెడ్డి, వివిధ జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను సత్వరమే అందించాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నాగాంజనేయులు


మాట్లాడుతున్న నాగాంజనేయులు

రేపల్లె రూరల్: టిడ్కో గృహాలను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలన్నారు. గతంలో పూర్తి చేసిన టిడ్కో గృహాలను తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, రేపల్లె పట్టణంలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, శాఖ కార్యదర్శి చొక్కాకుల శివశంకర్, లబ్ధిదారులు సత్యనారాయణ, చంద్రశేఖర్, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్ : కాకినాడలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో దుగ్గిరాల మండలంలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆదివారం పాల్గొన్నారు. రాష్ట్ర నాయకులు మల్లేశ్వరరావు మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పడి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కాకినాడలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నాల్గవ రోజు దుగ్గిరాల మండలం నుంచి 20 మంది ఉపాధ్యాయులు అక్కడకు వెళుతున్నామని చెప్పారు. జిల్లా కోశాధికారి ఎండీ గయసుదౌలా, మండల అధ్యక్షురాలు కామాక్షి, తదితరులు పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు పూజలు



ఫిరంగిపురం: కార్మెల్ కొండపై ఉన్న కార్మెల్ మాతను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నంద్యాల, ధర్మవరం. మార్కాపురం, పల్నాడు జిల్లా నుంచి భక్తులు ఇక్కడికి చేరుకున్నారు. కొండను ఎక్కి తల నీలాలు సమర్పించారు. కార్మెల్ మాతను దర్శించుకొని కొవ్వొత్తులు వెలిగించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై వరకు వెళ్లలేని భక్తుల కోసం దిగువన ఏర్పాటు చేసిన కార్మెల్ మాత స్వరూపానికి భక్తులు కొవ్వొత్తులు వెలిగించారు.

రైసు మిల్లు తనిఖీ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రాఘవేంద్ర రైసు మిల్లును ఆదివారం తనిఖీ చేసినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. మిల్లులో ఉన్న నాలుగు బంకర్లలో ఒకదానిలో రేషన్ బియ్యం ఉన్న గుర్తించామన్నారు. సిబ్బందితో వాటి బరువును అంచనా వేయాల్సి ఉందన్నారు. రైసు మిల్లు నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ 6ఏ కేసు నమోదు చేసేందుకుగాను పంచనామా చేస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట ఆర్ఐ అబ్దుల్ రెహమాన్, వీఆర్వోలు సుభాని, శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

రైలులో చైను లాగిన ఆకతాయి

తెనాలి రూరల్: ఆకతాయి చైను లాగడంతో రైలు నిలిచిపోయిన ఘటన ఆదివారం సాయంత్రం తెనాలిలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. తిరుపతి నుంచి బిలాస్‌పూర్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్ ఆదివారం సాయంత్రం తెనాలిలోని మల్లెపాడు గేటు వద్దకు రాగానే ఓ వ్యక్తి చైను లాగడంతో ఒక్కసారిగా రైలు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. చైను లాగిన వ్యక్తిని తోటి ప్రయాణికులు టీసీకి అప్పగించారు. ఐదు నిమిషాలు ఆగి రైలు బయలుదేరిందని రైల్వే వర్గాలు తెలిపాయి.

కవయిత్రి అస్మతున్నీసాకు సత్కారం



తెనాలి: విజయవాడకు చెందిన సాంస్కృతిక సేవాసంస్థ తెలుగు కళారత్నాలు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జాతీయ సంక్రాంతి, జాతీయ కవి సమ్మేళనంలో తెనాలి కవయిత్రి షేక్ అస్మతున్నీసాను సత్కరించారు. ఆమె తెనాలిలోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో తెలుగు ఉపాధ్యాయినిగా చేస్తున్నారు. రచన ప్రవృత్తి. రెండు కవితా సంపుటాలు తీసుకొచ్చారు. కెనడా రేడియోలోనూ ఆమె కవితలు ప్రసారం కావటం మరో విశేషం!

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి జూదరులను అరెస్ట్ చేశారు. రూరల్ మండలం కొలవరం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ సిబ్బందితో కలసి శనివారం అర్ధరాత్రి దాటాక దాడులు నిర్వహించారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 10,200, మూడు బైక్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

సిమెంట్ బల్లలు బహూకరణ

భట్టిప్రోలు: స్థానిక టీఎంరావు హైస్కూల్ హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు–శేషపద్మావతి దంపతులు వాసవీ క్లబ్ తరఫున 12 సిమెంట్ బల్లలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు పీహెచ్‌సీలో రోగులు సేద తీరేందుకు, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు వీటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరరావు దంపతులను పలువురు అభినందించారు.

భట్టిప్రోలు హైస్కూల్‌లో మాక్‌డ్రిల్

భట్టిప్రోలు: శారీరక దృఢత్వానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్ హెచ్‌ఎం చందలూరి రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక హైస్కూల్‌లో ప్రతి ఆదివారం ప్రత్యేకంగా మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు యోగా ఉపకరిస్తుందని, తద్వారా విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అశోక్‌బాబును కలసిన సిరాజుద్దీన్



భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన భట్టిప్రోలుకు చెందిన సయ్యద్ సిరాజుద్దీన్ ఆదివారం పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబును చెరుకుపల్లిలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. తనను గుర్తించి నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన అశోక్‌బాబుకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట భట్టిప్రోలు మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బాపట్ల మున్సిపల్ హైస్కూలు వార్షికోత్సవం వాయిదా

బాపట్ల: బాపట్ల మున్సిపల్ హైస్కూలు వార్షికోత్సవం ఏప్రిల్ 13వతేదీన నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామని పాఠశాల పూర్వ విద్యార్థుల కార్యవర్గ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్ తెలిపారు. ఆదివారం హైస్కూలులో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. హైస్కూలు 1975–76 వార్షికోత్సవం తొలుత ఈనెల 12వ తేదీన నిర్వహించాలని నిర్ణయించామని, అయితే వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా వార్షికోత్సవాన్ని ఏప్రిల్‌కు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈసమావేశంలో కార్యదర్శి కొలగాని వెంకట సత్యనారాయణ, సభ్యులు గోపాలం దుర్గాప్రసాద్, డాక్టర్ పీవీ కృష్ణారావు, సీతారాం కుమార్, కొటికలపూడి సోమయ్య, బీమా శంకర్రావు, కాజా ఖాన్, కోళ్లపూడి సురేష్, బి.బందబాబు పాల్గొన్నారు.